

# నెత్తుటి గులాబి

వి. ప్రతిమ

"అమ్మా మీ టికెట్?" ప్రశ్నించాడు కండక్టర్.

ఎడమచేతిలో ఏడుస్తోన్న వాలుగేళ్ళ బాబుని సముదాయిస్తూ మరో చేతిని బస్‌లోని నిలువు రాడ్ చుట్టూ వేసి బ్యాలెన్స్ చేస్తూ, భుజానికి వేలాడుతోన్న వైర్ బ్యాగుని సరిచేసుకుంటూ పర్సులో వున్న సీజన్ టిక్కెట్టు తీయడానికి ప్రయత్నిస్తోందామె ఆ కదులుతోన్న బస్సులో.

అలా వేగంగా కదులుతోన్న బస్సులో ఎల్బుని ప్రయాణించడం ఆమెకి కొత్తేమీ కాదు... గత రెండు సంవత్సరాలుగా ఆమె ఉదయం, సాయంత్రం సిటీ బస్సులో ప్రయాణిస్తూనే వుంది.

"కొంచెం వుండరా తేజా! వచ్చేసింది వెళ్ళిపోదాం" చెప్పింది కొడుక్కి.

వాడు వినలేదు... పైపెచ్చు ఆవేశంగా తల్లి జుట్టు పట్టి లాగుతూ వెనక్కి వక్కి వంగుతున్నాడు విరుచుకుంటూ... ఆమె బేలన్స్ తప్పి తట్టుకుని వెనక్కి పడబోయింది... ఇదే అదనుగా ఆమె వెనుకనున్న కాలేజీ కుర్రాడామె భుజాలు పట్టుకుని ఆపాడు.

సిగ్గుతోనూ, అవమానంతోనూ, అయిష్టంతోనూ ఆమె ముఖం ఎర్రబడింది... ఆమె గుండె కనుకొలకుల్లో నీటి బొట్లు... తేజ ఏడుపు ఆపకపోగా ఆమెని పిడిగుద్దులతో సత్కరించసాగాడు... బస్సు బస్సంతా మాటలు ఆపేసి ఆమెకేసి వింతగా, జాలిగా చూడసాగింది.

భూకంపంలాటిదేదో వచ్చి తనూ, ఈ బస్సూ, ఈ మనుషులూ అంతా అందులోకి కూరుకుపోగలిగితే బావుండునన్పించింది ప్రత్యూషకి. ఆమె మన సంతా పరమ చేదుగా వుంది. జరుగుతోన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేని దైన్య స్థితి అది. అవమానాగ్నితో జ్వలిస్తోన్న ఆమె మెదడు విపరీతమైన టెన్షన్‌కి గురయి అచేతనావస్థకు చేరువవుతోంది.

"తేజా నా మాట వినరా నాన్నా" బతిమాలుతోందామె ఆ స్థితిలో కూడా సహనాన్ని కోల్పోకుండా. ఊహూ. చెప్పింది విని అర్థం చేసుకునే మామూలు అందర్లాటి కుర్రాడు కాదు వాడు. మెంటల్లీ రిటార్డెడ్... వాడికి వినిపించదు... అందుకని వాడి జేబులో వినికిడి మిషను వుంటుందెప్పుడూ...అది చిరాగ్గా లాగి లాగి పడేస్తుంటాడు అప్పుడప్పుడూ.

ప్రత్యూష ఎట్టి పరిస్థితుల్లోనూ సహనాన్ని కోల్పోడానికి వీల్లేదు... వాడిని ఏమీ అనకూడదు. బరువెక్కిన ఆమె మనసుకి తరచుగా ఏకాంతంలో జల జలమని రాలిపోవడం తప్ప మరో మార్గం లేదు. వాడు పుట్టిన సంవత్సరానికి అర్థమయింది వాడికి వినిపించదని. వినిపించదు కాబట్టి తెలివితేటలూ, అవసరమైన జ్ఞానమూ పెరగలేదు. 'మెంటల్లీ రిటార్డెడ్ స్కూల్లో జాయిన్ చేసి ప్రతిరోజూ వాడిని తీసికెళ్ళడమూ, తీసుకురావడమూ... ఎంత ప్రయత్నించినా రోజురోజుకీ ఆమె సహనం సడలిపోతూంది.

బస్సు దిగిన తరువాత దాదాపు అర మైలు దూరం వున్న ఇంటిదాకా సందుల్లో, గొందుల్లో తేజనేసుకుని నడవడమన్నది మరో యజ్ఞం... ఇంటికి రాగానే వాడిని విసురుగా కింద పడేసి ఒళ్ళో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగిందామె.

కింద పడిన తేజ మరింత బిగ్గరగా ఏడుస్తున్నాడు.

అక్కడే సోఫాలో కూర్చుని పేపరు చూస్తోన్న సత్యనారాయణగారు లేచి హడావిడిగా కూతురి వద్దకు వచ్చారు.

"అమ్మా ప్రత్యూషా! ఏమిటమ్మా మను చేస్తున్నది?" అన్నారాయన కూతురి తల నిమురుతూ... ఆయనకీ కూతురి పరిస్థితి అర్థమవుతూనే వుంది.

"నాన్నా" అంటూ ఆయన ఒడిలోకి వాలిపోయింది ప్రత్యూష

"ఏంటండీ, ఏం జరిగింది?" ఈ హడావిడికి లోపలి నుంచి వచ్చిన తల్లి గుక్కపట్టి ఏడుస్తూన్న మనవడిని చేతిలోకి తీసుకుంటూ ప్రశ్నించింది... తండ్రి ఒడిలోంచి తల తిప్పకుండా వెక్కుతూనే వుంది ప్రత్యూష.

"తల్లీ! ఏమయిందమ్మా... చెప్పకపోతే ఎలా తెలుస్తుంది?" కూతురి తల నిమురుతూ బాధగా ప్రశ్నించారాయన.

"నాన్నా... నాన్నా... నాకు వీడొద్దు నాన్నా. నేను చచ్చిపోతాను. ఈ ప్రపంచంలో వాడయినా వుండాలి... నేనయినా వుండాలి... ఎన్నాళ్ళు వీడితో నేనిలా కొలువు చేయను? నా వల్ల కాదు నాన్నా. ప్లీజ్... నేను చచ్చిపోతాను నాన్నా" హిస్టీరికల్‌గా ఏడుస్తోన్న కూతురి వంక జాలిగా చూశాడాయన.

ఎంతో అల్లారుముద్దుగా, అపురూపంగా పెరిగిన ప్రత్యూష అలా హృదయ విదారకంగా, దీనంగా ఏడుస్తూంటే ఆయన హృదయం తరుక్కుపోయినట్లయింది...

"నాన్నా వీడినెక్కడయినా అనాథాశ్రమంలో చేర్పించేద్దాం... నాకు వీడొద్దు నాన్నా. ప్లీజ్ వీడొద్దు... ఆ సిటీబస్సుల్లో నేనిక ప్రయాణం చేయలేను నాన్నా."

"అంతమాటనకు తల్లీ. లే ముందు స్నానం చేసిరా... తేజ చూడు ఎలా అయిపోయాడో... పదినలంతా చూడు ఎలా చూస్తున్నారో."

తలెత్తి చుట్టూ చూసిందామె. పెరటి వాకిట్లో నుంచి పెద్దొదినా, వంట గది గుమ్మం నుంచి చిన్నొదినా తొంగి తొంగి తనకేసి జాలిగా చూస్తున్నారు... ఆ జాలిలోనే ఓ విధమైన ఆత్మసంతృప్తి... "ఛి... ఛీ... ఏమిటిలా బయటపడిపోయాను" అనుకుంటూ గబుక్కున కళ్ళు తుడుచుకుని లేచి బాత్‌రూమ్‌లోకి నడిచింది ప్రత్యూష.

స్నానం చేసి, అమ్మ ఇచ్చిన కాఫీ తాగి తన గదిలోకెళ్ళి పడుకుండిపోయింది.

"అమ్మా... మా... మా" అంటూ చిట్టి చిట్టి చేతులతో తేజ తల్లి బుగ్గలను తాకుతుండగా గబుక్కున మెలకువ వచ్చింది. తన హృదయంలోలాగే గది నిండా చీకటి పేరుకుపోయింది. చప్పున ఆమె కళ్ళల్లో నీళ్ళూరేయి... "మా ... మ్మా" పిలుస్తూనే వున్నాడు తేజ.

"పాపం ఇలా పుట్టడం వాడి తప్పా?... కాదే కాదు ఇదంతా తన దురదృష్టం... ముత్యాల్లాంటి పిల్లలు మానస, మందార పుట్టిన తరువాత ఇక చాలు, ట్యూబెక్టమీ చేయించుకుంటానని ఎంత గొడవ పెట్టింది తను"

'ఇదెక్కడి చోద్యమే తల్లీ... నాకు ఒక్కగానొక్కడు... వాడికి ఇద్దరూ ఆడపిల్లలే అయితే ఎలా... ఒక మగ నలుసు లేకుండా కుదరదు' అంటూ రాగాలు తీసింది అత్తగారు...

'అలా కాదత్తయ్యా! మళ్ళీ ఆడపిల్ల పుడితేనో...? నా ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే వుంది కదా' నచ్చచెప్పాలని చూసింది ప్రత్యూష

'ఇద్దరికే ఇలా డీలాపడిపోతే ఎలానే? మా కాలంలో ఎంతెంత మందిని కనేవాళ్ళం?... నాకు ఏటా కానుపు తెలుసా?' గర్వంగా చెప్పిందావిడ ఏదో ఉమెన్ అడ్మినిస్ట్రేటర్‌లాగా... ఆవిడకి అయిదుగురాడపిల్లల తరువాత తన భర్త చివరివాడు... అలాగే తనకూ ఒక మగపిల్లాడు కావాలని వాదిస్తుందావిడ.

ఆడయినా, మగయినా ఒకటేనని చెప్పినా ఆవిడ అర్థంచేసుకోదు. పైపెచ్చు భర్త కూడా ఆవిడవైపే మొగ్గుచూపుతున్నాడు. తన శరీరాన్ని చీల్చుకుని వేరే జీవితాన్ని ఈ లోకంలోకి తీసుకొచ్చే విషయం మీద తనకి ఏ మాత్రం అధికారం లేదన్న విషయం అర్థమయింది ప్రత్యూషకి.

ఫలితంగా ఈ తెలివిహీనుడూ, వినికిడి లేనివాడూ అయిన వంశాంకురం తన ఒడిలో పడ్డాడు... అది కూడా తన తప్పేనంటుంది అత్తగారు. ఇటు ఏడు తరాల్లోనూ, అటు ఏడు తరాల్లోనూ మా వంశంలో ఎవరికీ ఇటువంటి బిడ్డ పుట్టలేదు అంటుంది గుచ్చుతూ. అంటే మీ వాళ్ళకే ఎవరికో ఇటువంటి దోషం వుంది అన్నట్టుగా. ప్రసవించినపుడు చూడ్డానికి రావడం తప్ప, మళ్ళీ ఆవిడ తేజని చూడలేదు. భర్త లోకం కోసమో,! బయొలాజికల్ నీడ కోసమో, లేక భార్యన్న ప్రేమతోనో వారం వారం వచ్చినా వాడిని దగ్గరికి తీసుకోడు.

నిజమే వాడు తల పెద్దదిగా, కాళ్ళూ చేతులూ పుల్లల్లా, నల్లగా వికృతంగా వుంటాడు... అంత మాత్రాన తమ రక్తం పంచుకు పుట్టిన బిడ్డ కాదూ... మరి ఎందుకంత అసహ్యం ఆయనకి? వాడు పుట్టడానికి కారణం ఆయన కాదూ... తన మూలంగా కాదూ మూడోసారి తను పురిటికొచ్చింది... ఇద్దరు వాళ్ళకేం? వాళ్ళంతా బాగానే వున్నారు...

ఎటొచ్చీ తనే ఇద్దరు బంగారు బొమ్మల్లాంటి ఆడపిల్లల్ని హాస్టల్లో వుంచి... భర్తకి, సంసారానికీ, స్వేచ్ఛకీ దూరంగా ఇలా తల్లిదండ్రుల వద్ద, వదినెల విసుగులూ, చిరాకులూ భరిస్తూ సిటీ బస్సుల్లో జీవిస్తూ...

పగలంతా గడిచిపోయిన తరువాత.

రాత్రి రెక్కల మీద ఒత్తిగిలే నిశ్శబ్దపు పొరలని నెమ్మదిగా కదిలిస్తూ ఆ నీరవ నిశ్శబ్దంలో

ఏకాంత తపస్సులో నిమగ్నమైతే ఎన్నో జ్ఞాపకాలు వర్షంలా కురవడం మొదలెడతాయి.

మానస, మందార ... ఆయన, తన ఇల్లూ, సంసారం, ఎన్నెన్నో అనుభూతుల పరిమళాలు. ఆ తరువాత అనంతమైన నిశ్శబ్దం... అదృశ్యమైన బంగారు స్వప్నాల సౌధాలు ఆమె హృదయపు వాకిట్లో దిగులు మేఘాలై కురుస్తూ వుంటాయి.

## హైకూలు

రాయి కాదను నాటింది
కొలను
తామరాకై విప్పారింది

బాధలు
వేర్లు దిగనివ్వు
పూలు పూస్తావు

పిట్ట ఎగురుతోంది
పాపం
పొట్ట రెక్కలతో పట్టుకొని

తుఫాను రేగింది
కెరటాలు ముంచాయి
కనుల తీరాలు

– బి.వి.వి.ప్రసాద్

"ప్రత్యూష చెప్పినట్టుగా ఆ పిల్లాడ్ని అనాథాశ్రమంలో చేర్పించడం మంచి పని... ఆ తరువాత ఆ అమ్మాయి భర్త దగ్గరికెళ్ళిపోతుంది. మనం మాత్రం ఎంతకాలమని భరిస్తాం" చెప్తోంది పెద్దాదిన.

"అవునక్కా! ఇటువంటి బిడ్డలు వుట్టినా అయిదారు నెలల కంటే ఎక్కువ బతకరంటారు కదా... వీడేమిటీ ఇన్నేళ్ళు నెట్టుకొచ్చాడు" చిన్నాదిన అనుమానం వెలిబుచ్చింది.

"ఏమయినా ప్రత్యూష రోజూ వాడిని స్కూలుకి తీసికెళ్ళడం, తీసుకురావడం... చాలా శ్రమతో కూడుకున్నది... ఆ సిటీబస్సులో ప్రయాణం నిజంగా ఒక యజ్ఞం" పెద్దన్నయ్య జాలి చూపిస్తున్నాడు.

"అంత జాలి వుంటే రోజూ వెళ్ళి దిగబెట్టి రాకపోయారా?" పెద్దాదిన వెటకారం చేస్తోంది.

ప్రక్క గదిలో నుండి వినిపిస్తున్న శూలాల్లాంటి మాటలను వింటూ కొడుకుని మరింత గాఢంగా గుండెలకు హత్తుకుంది.

'అమ్మో! వీడిని వదిలి, తను వుండగలదా? కన్నతల్లి తనకే వీడి విషయంలో ఇంత విసుగ్గా వుంటే, అనాథాశ్రమంలో వీడిని ఎవరు చూస్తారు ప్రేమగా.'

***

"ఏమండీ! ఎంతకాలమిలా? నేనిక్కడా, మీరక్కడా, పిల్లలెక్కడో చెట్టుకొకరూ, వుట్టకొకరూగా... ఇక నేను మిమ్మల్నొదిలి వుండలేనండీ ప్లీజ్... ఈ సిటీ బస్సుల్లో ప్రయాణమూ చేయలేను. మనం ఇక్కడ ఫ్యామిలీ పెడదామండీ ప్లీజ్... స్కూలుకి దగ్గరగా ఇల్లు తీసుకుందాము... అప్పుడయితే నేను వీడికొక్కంత వ్యాయం చేయగలనేమో" వీకెండ్‌కి వచ్చిన భర్త గుండెల మీద వాలి కళ్ళనీళ్ళు పెట్టుకుంది ప్రత్యూష

"ఏం చేద్దాం ప్రత్యూ... మనం ఇంతవరకే తెచ్చుకున్నాం... ఇంకొన్నాళ్ళు ఓపిక పట్టు... అక్కడి పొలాలన్నీ బేరం పెడ్తున్నాను. అది సెటిల్ చేసి ఫ్యాక్టరీ పెద్ద బావగారి మీదొదిలి మనం ఇక్కడే ఏదయినా వ్యాపారం చేసుకుందాం... అందాకా నీకీ ఇబ్బంది తప్పదు... అయినా ఇదంతా మన ఖర్మ..." బాధగా చెప్పాడు సురేష్

గత మూడేళ్ళుగా భర్త ఇలానే చెప్తున్నాడు... అతడా పొలాలు అమ్మడు... తల్లిదండ్రుల్నీ, ఇల్లు వాకిళ్ళనీ, వ్యాపార సాపారలనీ వుట్టిన వూరినీ వదిలి ఆయన దృష్టిలో ఒక వికృత శిశువు కోసం ఇంతదూరం రావడానికి సిద్ధంగా లేడతడు... కాకుంటే తను అడిగినప్పుడల్లా ఆ విధంగా చెప్పి మభ్యపెడ్తుంటాడు.

అయిదు నిముషాలు మౌనం వహించి

"సిటీబస్సుల్లో ప్రయాణం కష్టంగా వుండి,... మరెవరికితోనయినా పంపుదామంటే తల్లి తప్ప మరెవరూ తీసుకోకూడదని కండిషన్ పెట్టారు వాళ్ళు... తల్లుల్ని కూడా ఎడ్యుకేట్ చేస్తారక్కడ."చెప్పింది ప్రత్యూష

"నిజమే ఈ మెంటల్లీ రిటార్డెడ్ స్కూలు మనూళ్ళో లేకపోవడం మన దురదృష్టం ... ఎనీవే ఇంకా కొన్నాళ్ళు మనకీ ఎడబాటు తప్పదు... నీకీ ఇబ్బందీ తప్పదు" భార్యని దగ్గర తీసుకొని వచ్చచెప్పి ప్రయాణమయ్యాడు సురేష్.. భర్తని సాగనంపి ఇంట్లోకి వస్తూండగా వినిపించాయా కేకలు... తల్లి ఎందుకో పెద్ద పెద్దగా అరుస్తోంది.

"అబ్బబ్బ పిల్లాడు కాదు వీడు... అది ఏ జన్మలో చేసుకున్న పాపమో ఈ జన్మలో శాపమై పుట్టుకు పీడిస్తున్నాడు. వీడు లేకున్నా హాయిగా వుండును... దాని జీవితం బాగుపడిపోను"

భయం భయంగా లోపలికొచ్చింది ప్రత్యూష

పెద్దాదిన గదిలో ఫ్లవర్‌వాజు పగులగొట్టి, ఆ గాజుపెంకులు చేతుల్లో గుచ్చుకోగా, ఆ రక్తం కారుతూంటే నొప్పి కూడా తెలీని స్థితిలో చప్పట్లు కొడుతూ అమ్మమ్మకేసి చూస్తున్నాడు తేజ... వాడికి అమ్మమ్మ తనని తిడుతోందన్న సంగతి కూడా తెలీడం లేదు.

"ఒకనాటితో వదిలే పీడ కాదు ఇది... ఏలిన్నాటి శని, ఎల్లకాలమూ ఎవరివల్లవవుతుంది భరించడానికి... అది మా అన్నయ్య ఫారిన్నుంచి తీసుకొచ్చిన ఫ్లవర్ వాజు..." ప్రత్యూషకి విన్పించాలని పెద్దగా అంటోంది వదిన... ప్రత్యూష నలా గుచ్చడం వలన పగిలిపోయిన ఫ్లవర్‌వాజు తిరిగి వచ్చినంత ఆనందంగా వుందామెకి... ప్రాణం చచ్చిపోయింది ప్రత్యూషకి... దాదాపుగా ప్రతి రోజూ ఇటువంటి సంఘటనలు ఎదురవుతూనే వున్నాయామెకి.

# పద్యం బ్రద్దలైనప్పుడు

– డాక్టర్ సుమనశ్రీ



ఏ వాక్యమూ అర్థంకాదు ఉత్తగాలి తప్ప

నిద్రలో స్ఖలించిన నాల్గు అక్షరాలూ దుమ్ములో
ఇంకిపోతాయి నా అచేతనముందే

నిద్రలోంచి అమాంతం లేస్తుంది నా శవం
కళ్ళూ చెవులూ తిప్పతూ విచిత్ర ధ్వనుల్ని రువ్వతూ
కలయతిరుగుతుంది ఆకాశమంతా

ఒక కాంక్షా కుసుమాన్ని అదేపనిగా ఆఘ్రాణిస్తూ–
ఏ శబ్దమూ ఊహకందదు ఉత్త స్పర్శ తప్ప
శబ్దాల్ని సున్నితంగా స్పర్శించిన క్షణాల మధ్యే
నా ఊపిరినిండా ఒక విద్యుల్లత
నా బాహువుల నిండా స్వర్గద్వారాల పులకరింత

నే శిల్పించింది ఏదీ నా చేతుల మధ్య నిలవదు
గాలి కండరాల మీదుగా అనంతంలోకి
ప్రయాణిస్తుంది ఒక సరోవరంలా
నీళ్ళమధ్య ఊపిరి పీల్చే జలచరమే
ఊపిరిపోస్తుంది నా కళ్ళకి –

ఈ అలల మీదుగా ఏ నావా లేని శూన్యంలోకే నా ప్రయాణం
ఏ తీరమూ తాకదు నన్ను
ఆకాశంలో చీకటి చుట్టిన కాంతి తప్ప

భూమ్మీది కలల నిండా శవాల కంపే
శూన్యహస్తాల విశృంఖల అపస్మారమే
బ్రతుకుల నిండా నిలువెత్తు బండలు దొర్లిపోతుంటాయి
రక్తస్రావాల మధ్యే గాయాలు సేద తీరుతుంటాయి –

ఏ క్రియా వాక్యాన్ని పూరించదు
నిలువెత్తు అద్దం ముందు పద్యం బ్రద్దలౌతుంది




వదిన గదిలోకి వెళ్ళి శుభ్రంగా ఆ ముక్కలన్నీ ఏరి, తుడిచి వచ్చింది.. 'చిన్నోదిన చిన్న కొడుక్కి కూడా ఆ ముక్కలు గుచ్చుకోవడంతో వాడి చేతికి ప్లాస్టరేస్తూ సణుక్కుంటోంది చిన్నోదిన.

"ఏమిటమ్మా మరదలా... ఎవ్వరొచ్చినా ఆ హడావిడి... నాలుగు రోజులుండి వెళ్ళొచ్చు కదా... తమ్ముడిగార్ని వదిలి వుండేలా లేవే" అంటూ తనని ఆట పట్టించి, వుండమని బతిమాలిన వదినలేనా వీళ్ళు అనుకుంటూ ఆశ్చర్యపోయింది ప్రత్యూష

"మా... మా" అంటూ నెత్తురోడుతున్న చేతుల్ని ప్రత్యూష కట్టుకున్న చీరకి రుద్దుతూ పిలిచాడు తేజ...

కోపంగా చెంపమీద ఒకటిచ్చింది. ఆ తర్వాత కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ వాడి నెత్తుకుని గదిలోకి వెళ్ళిపోయింది.

"వీడినేం చేయాలి? ఎలా చెప్తే వీడర్థం చేసుకుంటాడు" దిండులో తల దూర్చి వెక్కి వెక్కి ఏడ్చింది ప్రత్యూష

"మేమంతా ఒకరూ, ఇద్దరుతో సరిపెట్టుకున్నాం... ముగ్గురు పిల్లల్ని కనడం దేనికి? ...ఇలా వూళ్ళోవాళ్ళ మీద పడి వేధించడం దేనికి?" పెద్దొదిన నిర్భయంగా, నిర్దాక్షిణ్యంగా మాటల తూటాలను వదులుతూనే వుంది... అవి ప్రత్యూష గుండెల్లోకి సూటిగా దూసుకుపోతూనే వున్నాయి.

వంశాంకురం కావాలంటూ పట్టుబట్టిన అత్త, వీడు వుట్టాక 'హాస్పిటల్లోనే వదిలి వెళ్ళిపోదాం. మనకొద్దు వీడు' అంటూ తనతో సంఘర్షించిన భర్తా... వీళ్ళు ఇప్పటి తన పరిస్థితి చూస్తే ఏ మంటారు?

'వాడు పుట్టకపోయినా బాగుండును. దాని జీవితం బాగుపడిపోను' పదే పదే తల్లి మాటలు జ్ఞప్తికి వచ్చి మనసును పొడుస్తున్నాయి... ఏడ్చి ఏడ్చి అన్నం తినకుండానే నిద్రపోయారు ప్రత్యూషా, తేజా కూడా...

***

ఆ రోజు ప్రత్యూష త్వరగా తయారయింది స్కూలుకి వెళ్ళడం కోసం.

కొడుక్కి మొన్న పుట్టినరోజుకి కొన్న కొత్త డ్రస్ వేసింది. అనేకానేక అవమానాలనీ, బాధలనీ సహించాక, ఎన్నెన్నో సందేహాలని అధిగమించిన తరువాత ఓ ప్రగాఢమైన నిర్ణయం తీసుకున్నట్టుగా తేటగా వుందామె ముఖం.

కొడుకునెత్తుకుని తల్లిదండ్రుల వద్దకెళ్ళి వెళ్ళొస్తానని చెప్పింది రోజూలాగే...

"తేజా... టాటా" చెప్పాడు తాతయ్య.

వాడికి ఇప్పుడిప్పుడే కొంచెం కొంచెం అర్థమవుతోంది. తాతయ్యకేసి చూశాడు... తల్లి వాడి చేతిని పట్టి తాతయ్యకూ, అమ్మమ్మకూ టాటా చెప్పించింది.

బస్టాపు వరకూ నడవడం ఈ రోజెందుకో పెద్ద కష్టంగా అనిపించలేదు ప్రత్యూషకి... బస్సు కూడా రోజూలాగ ఏ మాత్రం ఆలస్యం లేకుండా వెంటనే వచ్చేసినట్లనిపించింది. బస్సులో కూర్చుని కొడుకుని చూస్తూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది. ఈ రోజు వాడిని అనాథాశ్రమంలో చేర్పించడానికే నిశ్చయించుకుంది ప్రత్యూష.

భర్త, తండ్రి తనని ప్రశ్నిస్తే

తను బాత్‌రూములో వుండగా వాడెక్కడికో వెళ్ళిపోయాడనీ, ఎంత వెదికినా కన్పించలేదనీ చెప్పాలనుకుంది... చెప్పి నమ్మించుదామనే అనుకుంది... భర్త కెలాగూ కొడుకు పట్ల సహజాత్మీయతలు లేవు కాబట్టి దీన్ని పెద్ద సీరియస్‌గా పట్టించుకోడు... తండ్రి కూడా అంతర్గతంగా కూతురి క్షేమాన్ని కోరుతున్నాడు కాబట్టి తేలిగ్గా నిట్టూరుస్తాడు... ఆమె గుండె గొంతులోకొచ్చినట్టయింది.

బస్సు అనాథాశ్రమాన్ని సమీపిస్తూండగా, మరోసారి కొడుకుని గాఢంగా గుండెలకు హత్తుకుని ముద్దు పెట్టుకుంది ప్రత్యూష..

"మ్మా... మ్మా" పిల్లాడు వాడు తల్లి బుగ్గల మీద చేతులు వేస్తూ... వాడికదొక్క పదం మాత్రమే వచ్చు.

ఆమె గుండెల్లో నీటి చెమ్మ... కళ్ళల్లో నీటి అలలు.

"భగవాన్...ఏ తల్లికీ ఇటువంటి పరిస్థితి రాకూడదు..." ఆమె హృదయం మూగగా రోదిస్తోంది. కొడుకుని వదలలేనట్లుగా గట్టిగా హత్తుకుని వుంది... బస్సు అనాథాశ్రమం స్టాపింగ్‌లో ఆగింది.

ప్రతిరోజూ ఎన్ని వేల వేల క్షణాలు గడిచినా రాని గమ్యం, ఈ వేళ అతి త్వరగా వచ్చేసినట్టుగా అన్పించిందామెకు.

బరువెక్కిన హృదయంతో భారంగా లేచి నిల్చుందామె... ఒక వైపు తేజ కోసం కొన్న తినుబండారాల ప్యాకెట్లూ, వాడి బట్టల బ్యాగూ, తన హేండ్ బ్యాగూ, వాడి కోసం కొన్న దిండూ అన్నీ అస్తవ్యస్తంగా పట్టుకుని మరో చేత్తో 'తేజ'ని ఎత్తుకుని ప్రత్యూష జనాల్ని దాటుకుంటూ, నెట్టుకుంటూ బస్ దిగుతూండగా జరిగిందది.

హడావిడిగా బస్సెక్కబోతూన్న ఆ నడివయస్కుడి బ్యాగ్ తగిలి చప్పన జారి తేజ కింద పడ్డాడు... అదుపుచేయడం ప్రత్యూష శక్యం కాకుండా పోయింద్... సరిగ్గా అదే క్షణంలో కదిలింది ప్రక్కనే ఆగి వున్న బస్సు... కింద నిలుచున్న వాళ్ళకి కూడా ఆ బిడ్డని ఇవతలకి లాగే అవకాశం లేకుండా పోయింది... ఆ బస్సు ముందు చక్రం తేజ మీది నుండి వెళ్తూంటే నిస్సహాయంగా, అగమ్యంగా, నోట మాటరానిదానిలా దిగ్భ్రాంతంగా చూస్తుండిపోయింది ప్రత్యూష. ఒక్క క్షణం ఆ పేద్దు చలనం లేని చిత్తరువులా నిశ్చబ్దంగా అయిపోయింది.

కన్నెర్ర రంగు పాముకున్నట్టు రోడ్డంతా రక్తం... ఎర్రెర్రని రక్తం... మృత్యువు నల్లగా వుంటుందనుకునే వాళ్ళు ఎర్రనైన ఆ భయంకర ప్రళయాగ్నిని చూసి అప్పుడప్పుడూ చావు ఎర్రగా కూడా వుంటుంది సుమా అనుకునేలా

తూరుపు ఆకాశపుటమ్మీద బంగారు పెన్సిళ్ళతో రంగులు పూస్తోన్న బాల సూర్యుడు సిగ్గుపడేలా వుందా ఎర్రనైన మృత్యువు.

అయిపోయింది... అంతా అయిపోయింది... అనాథాశ్రమంలో వుండి ఆ తల్లిని నిందలపాలు చేయడం ఇష్టంలేక, తల్లిని అవమానాన్ని నుండి కాపాడడం కోసం ఆ పిల్లవాడీ ప్రపంచాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోయాడు శాశ్వతంగా.

జరిగిన వాస్తవాన్ని జీర్ణించుకోలేని ప్రత్యూష అక్కడికక్కడే స్పృహకోల్పోయింది...

అయితే ఆమె ఆశించినట్టుగా భర్త, పిల్లలతో ప్రశాంతంగా జీవించడం లేదు ప్రత్యూష.. ప్రస్తుతం ఆమె కిల్పాక్ మెంటల్ హాస్పిటల్లో వుంది. "నేనే చంపేశాను... నా బిడ్డను నేనే చంపేశాను... చేతులారా చంపేశాను" అని కేకలేస్తూండే ప్రత్యూషని అదుపులోకి తీసుకోవడం ఆస్పత్రి వర్గాల వశం కావడం లేదు... ఆమె భర్త సురేష్ అప్పుడప్పుడు వెళ్ళి భార్యని చూసి వస్తున్నాడు.